# పసివాడి దేశభక్తి

## ఎ. వి. రమణమూర్తి

స్కూలు మాస్టర్లకు జీతాలు తక్కువ. చిన్న ఊళ్లలో చదువులు చెప్పడం తక్కువ; పిల్లల్ని బాదడం ఎక్కువ.

విద్యార్థులను చితక కొట్టడంలో రామేశం మాస్టారిది పెట్టింది పేరు. సర్వీసు ప్రారంభంలో సన్నని బెత్తాలను ఉపయోగించేవారట. కాని, వారి ప్రతాపానికి బెత్తాలు తట్టుకోలేకపోయేవేమో, కాలక్రమంలో ఆయన స్వహస్తాల మీదనే ఆధారపడడం నేర్చుకున్నారు. జుత్తు పట్టుకొని గుంజడం, దవడలు వాయించడం, వీపుమీద ఏకబిగిని గుద్దడం చాలనట్లు ఈ రౌద్రరసానికి నేపథ్య సంగీతం వలె పళ్లు కొరకడం, అప్పటికీ కోపం చల్లారకపోతే తిట్లకు లంఘించుకోవడం.

తిట్టిన తిట్టు తిరిగి తిట్టకుండా తిట్టగలిగిన దిట్ట. వీపులు తట్లు తేలి వాచిపోయినా బాధపడని విద్యార్థులు ఆయన నోటికి జడిసేవారు. విద్యార్థులకు రామేశం సింహస్వప్నం. ఏ ప్రశ్నకు జవాబు చెప్పకపోతే కీడు మూడుతుందోనని భయంతో బిక్కచచ్చి పోయేవారు ఆయన క్లాసులోని కుర్రాళ్ళు.

మాస్టారు చక్కగా బొమ్మలు గీయగలరు. పాడగలరు. అంతకన్న చక్కగా పాఠాలు చెప్పగలరు.

జీతం తక్కువ కాబట్టి ప్రైవేట్లు చెప్పేవారు. ప్రైవేటుకు జీతం టైముకు ఇవ్వని వాడిని క్లాసులో ఏదో వంక పెట్టి చావబాదేవారు. ప్రైవేటు కుర్రాళ్లకు పరీక్షల ముందు పేపర్లందించే వారు. అప్పటికీ ప్రయోజనం లేని చవటలకు మార్కులను సర్దేవారు. ఏ సహాయానికయినా నిర్ధారణమైన రేటులో పుచ్చుకొనేవాడు. ఏతా వాతా పై సంపాదన పుష్కలంగా ఉండేది.

రామేశం మాస్టారు తిట్టడం నుండి పై సంపాదన వరకు—ఏ పనినయినా క్షుణ్ణంగా చెయ్యగలరనేది నిర్వివాదాంశం.

పంతులుగారి హస్తలాఘవానికి, ప్రైవేటుకు అందనివాడు ఆ సెక్షనులో



**భక్తికి, దేశభక్తికి కలిమి లేములతో నిమిత్తం లేదు. వయసు అడ్డురాదు ఈ దేశం నాది. అందుకు ఏమైనా చేయాలి అన్న మనో ధైర్యం ఉదయించాలేగాని, అకలి అర్థమూ లేదు, దరిద్రం పిలుపనూ లేదు.**

ఒకే ఒక విద్యార్థి— రాజా. తరగతిలో ఫస్టు. రాజా మార్కులను చూసి గర్వించే రామేశం రాజాను చూసి క్లాసులో కాపాలంగా మండిపడేవారు. 'ఈ గుంట వెధవొక్కడే పెన్స్ వంతటోను నా దగ్గర ప్రైవేటు చదవ లేదు. క్లాసులో దెబ్బలు తినలేదు' అని మాస్టారి కోపం. దెబ్బలు తిని రాజాను చూసి దెబ్బలు తినే మిగిలిన విద్యార్థులకు ఈర్ష్య— రాజాకు ఏదో వంకపెట్టి తన్నాలని రామేశం కోరిక. ఆ శుభసమయం త్వరగా రావాలని విద్యార్థుల కోరిక.

•   •   •

"తగ్గు. నువ్వు, ఎన్. టి. ఆర్. గొప్పలు చెపుతున్నావు. రామారావుకు నటన మేమిటి వచ్చునురా? తెలుగు సినిమాలో నాగేశ్వరరావు ముందు అంతా దిగదుడుపే." బల్లగుద్ది చెప్పాడు తిరుగు లేదన్నట్లు ఒక విద్యార్థి.

క్లాసు రెండు పక్షాలుగా చీలి పోయింది. ఎన్. టి. ఆర్. అభిమానులు, నాగేశ్వరరావు అభిమానులు. ఐక్యరాజ్య సమితిలో చర్చించవలసిన పోరున వాదోప వాదాలు సాగుతున్నాయి. ఆవేశం కట్టలు తెంచుకొని వస్తుంటే, తమ తమ స్థానాలను వదిలి ఒకచోట గుమిగూడి వాదించుకొంటున్నారు.

రాజా తల వంచుకొని పాఠాలు చదువు కొంటున్నాడు.

ఎవరు గొప్ప అనే వాదన సాగుతూంది.

"బండి సైట్!" బోర్డరు కిటికీల నుండి వార్నింగు—

"కోపేశం కమింగ్!"

రాజా తెరన్నై మాస్టారి రాకను గమనిస్తున్న విద్యార్థులు వాటికి సమాధానం చాలించారు. ఎవరు గొప్పో తేలలేదు. ఎవరికి వారి సీట్లలో వారు కూర్చుని పుస్తకాలు విప్పారు. చేపల బజారు వలె ఉన్న క్లాసురూములో నిశ్శబ్దం ఆవరించింది. సూది పడితే వినిపించే టంత నిశ్శబ్దం. మాస్టారు క్లాసులో ప్రవేశించి తృప్తిగా నవ్వుకొన్నారు. చేతిలో టిక్కెట్లపుస్తకాన్ని టేబిల్‌పై ఉంచి కుర్చీలో కూర్చున్నారు.

"చూడండబ్బాయిలూ. ఇవి సినిమాలకు, నాటకాలకు టిక్కెట్లు కావు. లాటరీటిక్కెట్లు. వీటిని మన ప్రభుత్వం వారే అచ్చు వేయించి అమ్ముతున్నారు. ఎందుకంటారేమో? వినండి.

ప్రభుత్వం ప్రజలకొరకు ఎన్నో సదుపాయాలను కల్పించాలి. రోడ్లు వేయించడం, స్కూళ్లను నడపడం, నదులకు ఆనకట్టలను కట్టించడం, ఆస్పత్రులు—ఇలాంటివెన్నో. జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. కోట్ల కొలది జనాభాకు సదుపాయాలు కలుగ జెయ్యాలంటే ఎన్ని కోట్ల డబ్బు ఖర్చవుతుందో ఆలోచించండి. ప్రభుత్వానికి డబ్బు ఎక్కడి నుండి వస్తుంది? అందుకే ఈ లాటరీ టిక్కెట్లు—ఒక్కొక్కటి ఒక రూపాయి. మీరు ఖర్చు పెట్టిన ఈ రూపాయి ప్రభుత్వం కోసం, అంటే ప్రజల కోసమన్నమాట. ఈ డబ్బంతా ప్రభుత్వమే తీసుకుంటుం దనుకుంటే పొరపాటు. లాటరీలో డ్రా తీస్తారు. ఫస్టు ప్రైజు లక్ష రూపాయలు. వింటున్నారా? మీ అదృష్టమే బాగుంటే, మీలో ఎవరో ఒకరు లక్షాధికారి కావచ్చు. లక్ష నుండి వంద రూపాయల వరకు ఎన్నో ప్రైజులున్నాయి. ఎవడికి ఏ పాచ్చు తగులు తుందో! మీ అదృష్టాన్ని పరీక్షించు కోండి.

అప్పుడే రెండేళ్లు దాటిపోయింది వీటిని ప్రవేశపెట్టి. మన స్కూలుకు ఇప్పుడే పంపించారు. లాటరీటిక్కెట్టును కొనడం మీ దేశభక్తికి నిదర్శన మన్న మాట."

పాఠానికి స్వస్తి చెప్పి, లాటరీటిక్కెట్ల పాఠం మొదలుపెట్టి తన వాటాకు వచ్చిన టిక్కెట్లను వదుల్చుకోవడానికి తాపత్రయం పడ్డారు రామేశం పంతులు. చకచకమని నలభై తొమ్మిది టిక్కెట్లు అమ్ముడయాయి. ఒకే ఒక టిక్కెట్టు మిగిలింది మాస్టారి చేతిలో.

ఒకే ఒక విద్యార్థి కొనలేదు.

మాస్టారి చేతిలో ఆఖరి టిక్కెట్టు గాలికి రెపరెపలాడింది.

'అయ్యో. నేను కొనలేకపోయానే!' అని రాజా మనస్సు బాధపడింది.

"ఒక్క టిక్కెట్టు మిగిలింది. కొనని వారెవరో దయచేసి కాస్త దర్శన మిస్తారా!" అవకాశాన్ని చక్కగా వినియోగించుకొన్నారు పంతులు.

నలభై తొమ్మిది జతల కళ్లు కది లాయి. ఒకేఒక విద్యార్థిపై కేంద్రీకరింప బడ్డాయి. అవమానంతో, దిగులుతో లేవలేక లేవలేక సీట్లో తల వంచుకొని లేచి నిలబడ్డాడు రాజా.

"ఏంరా, రాజా, ఈ లాటరీ టిక్కెట్టును కొనడానికి నీ కేమయినా అభ్యంతరమా?"

"మా. . . అమ్మగారి. . . నడిగి. . . చెపుతానండి." నీళ్లు నములుతూ సమాధానం.

"అడుగు, నాయనా. అలాగే అడుగు. మాతృవాక్య పరిపాలకుండొకడు ఈ నాటికి అవతరించాడు. చూడండ్రా! భోజనంకూడా అమ్మ నడిగే చెయ్యి, నాయనా." హాస్యం, వ్యంగ్యం, ఉక్రోషం మేళవించి మాస్టారు అక్కసు తీర్చు కొన్నారు.

క్లాసు గొల్లుమంది.

టేబిల్‌పై డస్టరు తంగుమంది.

"సైలెన్స్!" మాస్టారి కంఠం ఖంగు మంది.

రాజా కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఆఖరి గంట కొట్టారు.

బ్రతుకుజీవుడా అనుకొని రాజా బయటికి నడిచాడు.

•   •   •

రెండు నెలలు గడిచాయి. క్లాసులో టిక్కెట్లు మరి రెండు సార్లు అమ్మ డయ్యాయి. కాని పంతులుగారు చెప్పి నట్లు అదృష్టదేవత ఇంతవరకు ఆ క్లాసులో ఎవరినీ వరించలేదు. ఏభై టిక్కెట్ల పుస్తకంలో రాజా కొనలేని ఒక టిక్కెట్టు మాత్రం మిగిలేది. ఒక లాటరీ టిక్కెట్టును కొని తన దేశభక్తిని బుజువు చేసుకుందామనే రాజా కోరిక, ఒక టిక్కెట్టును ఎలాగయినా రాజాచేతకూడా కొనిద్దామనే రామేశం కోరిక తీరలేదు.

•   •   •

ఇంతలో పెను ప్రళయంలాగ వచ్చింది పధ్నాలుగు రోజుల యుద్ధం.



బ్రతుకు గడవక...

ఫోటో—ఎస్. వెంకటరమణ (మద్రాసు—30)

డిసెంబరు 1971. దేశానికి తూర్పు, పశ్చిమ సరిహద్దుల్లో యుద్ధజ్వాలలు. యుద్ధోన్మాది అగు నియంత యాహ్యాఖాన్ ఆదేశంతో పాక్ సైన్యాలు భారత దేశంపై దాడి చేశాయి.

అతివృష్టి, అనావృష్టి, వరదలు, గాలి వానలు, ఉప్పెనలు, కోటి మంది శరణార్థులు— కోటి సమస్యలతో సతమత మవుతున్న దేశానికి గోరుచుట్టుపై రోకటిపోటు.

వెయ్యి సంవత్సరాల యుద్ధం అన్నాడు భుట్టో.

రక్తనదులు పారుతాయన్నాడు.

గత్యంతరం లేని భారతదేశం శత్రువు నెదుర్కొంది.

భారత సైనికులు తూర్పు, పశ్చిమ రంగాలలో వీరవిహారం చేశారు.

యుద్ధం ఎంత అవాంఛనీయమైనప్పటికీ, స్వతంత్ర భారత చరిత్రలో యుద్ధపు రోజులే స్వర్ణదినాలు. రంగు రంగుల వారలు, ప్రాంతీయత, సంకుచితత్వం, ముఠాలు, సమ్మెలు, ఆందోళనలు పీఠం వేసుకొన్న రోజులలో యుద్ధం వరప్రసాదం. 1962, 1965 తిరిగి 1971. నిద్రాణమైన జాతి మేల్కొన్నది. జాతి నావహించిన జడత్వం వదిలిపోయింది. జాతి, మత, కుల, పక్ష సిద్ధాంతాల విభేదా లేవీ లేకుండా భారత ప్రజానీకం యావత్తూ ఒక్క తాటి మీద నిలిచి పోరాడింది.

చిల్లరమల్లర అలజడులన్నీ అడుగున పడ్డాయి.

ఉద్యోగులు సక్రమమైన విధినిర్వహణకు శపథం చేశారు. రోజు జీతాన్ని రక్షణ నిధికి విరాళంగా ఇచ్చారు.

స్కూళ్ళు, కాలేజీ విద్యార్థులు యాహ్యా గడ్డిబొమ్మను వీథుల వెంబడి తిప్పి తగులబెట్టారు.

స్త్రీలు పొదుపును అవలంబించారు.

ప్రతిపక్షాలన్నీ ప్రధానికి అండగా నిలిచాయి.

ఆవేశం, దేశభక్తి, జాతీయత పెల్లుబికిన దినా లవి.

ఒక్క దేశం, ఒక్క జాతి, ఒక్క మాట.


* * *

రామేశం మాస్టారు క్లాసులో ప్రవేశించారు. వార్తలను చెప్పారు. జాతిలో రగిలిన చైతన్యస్రవంతిని ప్రశంసించారు. దేశ సరిహద్దులలో వీరజవానులు ఏ విధంగా యుద్ధం చేసేదీ కళ్ళకు కట్టినట్లు చెప్పారు. ప్రజల కర్తవ్యం, రక్షణ నిధికి విరాళాలు, రక్తదానం, దేశభక్తి మొదలగు విషయాల గురించి ఉద్రేకంగా చెప్పుకుపోయారు.

కొడుకును యుద్ధంలో కోల్పోయి, వచ్చిన వెయ్యి రూపాయల పరిహారాన్ని రక్షణ నిధికి సమర్పించిన ఒక తల్లి... పారితోషికంగా వచ్చిన అయిదు వందల రూపాయలను రక్షణ నిధికి సమర్పించిన ఇద్దరు జాలరులు . . . ఇలాగ ఎన్నో ఉదాహరణలు చెప్పారు.

ఏభైమంది విద్యార్థులు ఆవేశంతో ఊగిపోయారు.

శ్రీమంతుల బిడ్డలు పకపకమని విరాళాలిచ్చారు. ఉంగరం ఒకడిస్తే, రిస్టువాచీ మరొకడు. చేతి బంగారుగాజులను తీసి ఇచ్చిందొక విద్యార్థిని. డబ్బు, వస్తువుల


కుటుంబములో
అందరికీ—
# అజంత
టూత్ బ్రష్‌లు

అజంత టూత్ బ్రష్‌లు, మీ పళ్ళను పూర్తిగా శుభ్రపరచుటకై, ఎంచుకోబడిన నైలాన్ బ్రిజిల్స్‌తో తయారుచేయబడినవి. ఇవి, గుండ్రపు నైలాన్ కుచ్చులు గలిగి, వైజ్ఞానికంగా డిజైన్ చేయబడినవి. ప్రతి బ్రష్ ఆరోగ్యకరంగా వుండుటకు, ప్రత్యేక కంటెయినర్‌లో ప్యాక్ చేయబడుతుంది. మీ పళ్ళను అతి శ్రేష్ఠమైన టూత్ బ్రష్‌తో తోముకొని ఆనందించండి—
అజంత 51

అజంత 41 తోముకునేటప్పుడు ఎక్కువగా లోపలికి వెళ్ళేటట్లు డిజైన్ చేయబడినది. అందువలన అన్ని పళ్ళను మీరు సుఖప్రదంగా తోముకోవచ్చును. అత్యంత విశిష్టత కలిగి, సరసమైన ధరకు అజంత 25 హార్డ్, మీడియమ్ లేక సాఫ్ట్ రకములు మీకు లభించును. బిడ్డలకు, పిల్లలకు ప్రత్యేక సాఫ్ట్ రకపు టూత్ బ్రష్‌లు లభిస్తాయి.

అందుబాటులో వుండే ధర కల అజంత లాంగ్ హెడ్, హార్డ్, మీడియమ్ మరియు సాఫ్ట్ రకములలోను, అజంత షేవింగ్ బ్రష్ మరియు అజంత హెయిర్ బ్రష్ కూడా లభిస్తాయి.

**ది బొంబే బ్రష్ కంపెనీ ప్రై. లి.**
బొంబాయి-34 (డబ్ల్యు.బి.)

టేబిల్‌పై కుప్పగా పడి ఉన్నాయి. మాస్టారి మొహం ఆనందంతో, తృప్తితో విప్పారింది. కాని, అంతలోనే కరుకుతనం.

"ఏంరా, రాజా, ను వ్వేమాత్రం ఇస్తావ్?"

మరొకసారి దోషిగా తలవంచుకు నిల బడ్డాడు రాజా. అతని వద్ద ఇవ్వడాని కేమీ లేదు.

"ఇలాగుందన్న మాట నీ దేశభక్తి!" మాస్టారి ఛీత్కారం.

ఆరవ తరగతి చదువుతున్న ఆ పసివాడికి అర్థంకాని మాట అది. "దేశభక్తి" చాలాసార్లు విన్నాడు ఆ మాటను. కాని, అర్థం తెలియలేదు.

"సార్!" భయం భయంగా గొంతుక పెగిలింది.

"చిన్న సందేహం, సార్."

"నవ ఫస్టు రాంక్‌గాడికి కూడా సందేహాలొస్తున్నా యన్నమాట. అడగరా, నాయనా, అడుగు. మీ సందేహాలను తీర్చడానికేగా ఈ వెధవ ఉద్యోగం నేను చేస్తున్నది!"

"దేశభక్తి అంటే ఏమిటండి?"

నెల తరబడి మనస్సులో గూడు కట్టుకొన్న కాఠిన్యం, ఉక్రోషం పంతుల్ని మృగంగా మార్చాయి.

"దేశభక్తికి అర్థం కావాలా, చిట్టి బాబూ? ఇంకా బోధపడలే? దేశభక్తంటే నీకు లేనిదీ, ఈ మిగిలిన కుర్రాళ్ల కున్నదీ.

మూడు నెలలయింది. వెధవది— ఒక్క లాటరీ టిక్కెట్టు కొనలేకపోయావు. ఏళ్లై టిక్కెట్లమ్మలేక పోయావని హెడ్‌మాస్టరుగారు నన్ను నెలనెలా తల వాచేలా చీవాట్లు పెడుతున్నారు. ఈనాడు దేశం ఎంతో గడ్డు పరిస్థితి నెదుర్కొంటోంది. ఎవరికి తోచినది వారు విరాళంగా ఇస్తున్నారు. పైసా విరాళంగా ఇవ్వలేనివాడివి! నీకా దేశభక్తికి అర్థం కావాలి? స్కూలు ఫీజు ఫ్రీ. పుస్తకాలు ఫ్రీ. నీ బతుకంతా ఫ్రీయే. మధ్యాహ్నం స్కూల్లో పాలు తేరగా పోస్తుంటే ఉల్సాగా తాగేవాడివి, నీ కెందుకురా దేశభక్తికి అర్థం?"

శిలాప్రతిమవలె రాజా తల వంచుకు నిలబడ్డాడు.

రామేశం కక్ష తీరలేదు.

"రాజా, ద్వీపమంటే ఏమిట్రా?"

అచేతనావస్థనుండి చేతనావస్థకు రాకపూర్వమే కలవరపాటుతో రాజా సమాధాన మిచ్చాడు.

"మూడు వైపుల నీరు, ఒక వైపు భూభాగం... సార్... కాదు, కాదు."

'కాదు, కాదు'కు ఆస్కారం లేదు. ఎన్నాళ్లబట్టో నిరీక్షిస్తున్నపంతులుకి అవ కాశం దొరికింది. ఒక్క తరుముకు రాజా



కుర్తాళం

ఫొటో—ఎన్. జగన్‌మోహన్ (మద్రాసు-1)

సీటువద్దకు వాలి, అతని జుత్తు పట్టుకొని కసితీరా బాదడం మొదలుపెట్టారు.

మాస్టారి చిరకాలవాంఛ తీరింది.

పంతొమ్మిది జతల కళ్లు చెమర్చాయి.

'లాటరీ టిక్కెట్టు, దేశభక్తి, రూపాయి, విరాళం, ద్వీపం, ద్వీపకల్పం, దెబ్బలు...

ఫీజు ఫ్రీ, పుస్తకాలు ఫ్రీ, నీ బతుకంతా ఫ్రీయే! దేశభక్తికి అర్థం కావాలా, చిట్టిబాబూ? నీకు లేనిదీ, మిగిలిన కుర్రాళ్ల కున్నదీ...'

స్కూల్లో నాడు జరిగిన సంఘటన లన్నీ కళ్లముందు తిరుగుతుంటే, రాజాకు ఆ రాత్రి కాళరాత్రి అయింది. 'ఎలాగ తన దేశభక్తిని ఋజువు చేసుకోవడం?

ఒక రూపాయి రక్షణ నిధి కివ్వాలి. ఎలాగ?

ఎక్కడనుండి తేవడం?

ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరయింది ఆ పసి హృదయం. ప్రశ్నలు ప్రశ్నలు గానే ఉండిపోయాయి. ఎప్పుడో తెల్లవారు ఝామున నిద్రాదేవి కరుణించింది.

* * *

గుడిసె, దానిలో నుక్కిమంచం, దాని కింద పాత పెట్టె— ఇవి సుందరమ్మ స్థిరాస్తి, చరాస్తి కూడా. పెట్టెను బయటికి లాగి తెరిచి చూసింది. మిగిలినది ఒక్క రూపాయి. నెల ఇంకా మూడు రోజులు గడవాలి. మిగిలిన రూపాయితో బియ్యం కొని ఎలాగో బొటాబొటిగా నెలాఖరు వరకు కాలక్షేపం చెయ్యాలను కొని పెట్టెను యథాస్థానంలో ఉంచి కలవారి ఇండ్లలో వంటావార్పుకు బయలు దేరింది సుందరమ్మ.

ఓరకంటితో తల్లి చర్యలను గమని స్తున్న రాజా పెట్టెను తెరిచాడు. ఒక రూపాయి కనపించింది. పెట్టెలో ఎంత వెతికినా మరి డబ్బు ల్లేవు.

బియ్యంకుండలో తడిమాడు— బియ్యమూ లేవు, డబ్బులూ లేవు. రూపాయిని తీశాడు. మనస్సు ఆక్రోశిస్తూంది.

"నువ్వు తప్పు చేస్తున్నావ్... నీ తల్లి వద్దంది. దొంగతనం... నీ తల్లి పడే బాధ. నెలాఖరు వరకు ఏమిటి తింటావ్?"

రూపాయిని యథాస్థానంలో ఉంచాడు.

కర్తవ్యం స్ఫురించలేదు.

'దేశభక్తి? నీకా!... నీ బతుకంతా ఫ్రీయే... దేశభక్తంటే నీకు లేనిదీ, ఈ మిగిలిన కుర్రాళ్ల కున్నదీ.' చెవుల్లో ప్రతిధ్వనిస్తూంది హేళన.

కొనకు దృఢ నిశ్చయానికి వచ్చాడు. రూపాయిని నిక్కరు జేబులో పెట్టుకొని తేలికపడిన మనస్సుతో స్కూలుకు వెళ్లాడు రాజా. సగర్వంగా మాస్టారి చేతిలో ఆ రూపాయిని పెట్టి, రక్షణ నిధికని చెప్పాడు.

మాస్టారు మెచ్చుకున్నారు.

పసివాడి మనస్సు తేలికపడింది.

సాయంకాల మయింది. ఇంటికి వెళ్ల డానికి దిగులు. బాగా చీకటి పడేవరకు ఇక్కడా అక్కడా తిరిగాడు. తుదకు బలవంతంగా కాళ్లీడ్చుకుంటూ ఇల్లు చేరాడు.

"రాజా, పెట్టెలో రూపాయి తీశావురా?"

పసివాడికి అబద్ధం చెప్ప బుద్ధి కాలేదు.

"తీశానమ్మా. జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చాను. అందరూ ఇస్తున్నారమ్మా. ఆ నెహ్రూ బిడ్డ లక్షల వెయ్యి రూపాయి లిచ్చిందట. మా మాస్టారు చెప్పారు. మా క్లాసులో పిల్లలంతా— ఉంగరాలు, రిస్టు వాచీలు కూడా ఇచ్చారమ్మా. దేశభక్తట..."

అయోమయంగా చెప్పుకుపోతున్న రాజాకు చెంప ఛెళ్లుమంది.

"పూట తిండికి తికానా లేదు. రాత్రికి బియ్యం లేవు. ఏమిటి తింటావు మిగిలిన మూడు రోజులూ? దేశభక్తట! విరాళం ఇచ్చాడట! దొంగవెధవా!"

కోపంతో సుందరమ్మ రాజా చెంపలు వాయించింది.

మాతృదేవత చెప్పింది నిజమో, గురు దేవులు చెప్పింది నిజమో పసివాడికి అర్థం కాలేదు. కాని, సమాధానం మాత్రం సిద్ధం చేసుకొన్నాడు.

ఏడుస్తూనే రాజా చెప్పాడు: "అవసరమయితే పస్తులుంటానమ్మా! నెలాఖరు వరకు నేను అన్నం తినను... దేశం కష్టాల్లో ఉందమ్మా. ఎవరికి తోచినది, ఎవ రివ్వగలిగినది వా రివ్వాలి. అందుకే నేనూ రూపాయి ఇచ్చాను, నువ్వు వద్దన్నా సరే. దొంగతనం చేశా నమ్మా. తప్పే. కాని, అది చందాగా ఇచ్చా నమ్మా... అందుకే నెలాఖరు వరకు నాకు వండకు..."

తను కన్న బిడ్డ, తన కళ్లముందు పసివాడు తన కర్థం కాని ఏవేవో పెద్ద పెద్ద మాటలు చెబుతుంటే విన్నపాయి రాలైన సుందరమ్మ రాజాను కౌగిలించు కొని ఏడ్చింది. ★